క్లుప్తంగా

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం



మల్లికార్జున ఖర్గేను సన్మానిస్తున్న కాటా శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి విజయభేరి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆదివారం పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

హత్నూర (సంగారెడ్డి): ఎన్నికల పరిశీలకులు, పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఆదివారం మండలంలోని దేవులపల్లి బస్ స్టేజి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు యాదయ్య ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు చేశారు. దౌల్తాబాద్- నర్సాపూర్ ప్రధాన రహదారిపై జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతీ వాహనాన్నిపరిశీలించి పంపుతున్నారు.

అభివృద్ధి కోసం బీఎంపీని గెలిపించండి

జాతీయ ఉపాధ్యక్షుడు దాస్‌రాం నాయక్



మాట్లాడుతున్న దాస్‌రాం నాయక్

నారాయణఖేడ్: నారాయణఖేడ్ అభివృద్ధికి బహుజన్ ముక్తిపార్టీ (బీఎంపీ) అభ్యర్థి ప్రకాష్ రాథోడ్‌ను గెలిపించాలని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాస్‌రాం నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని జుక్కల్ తండా, హన్మంత్‌రావుపేట్ గ్రామాల్లో అభ్యర్థి ప్రకాష్ రాథోడ్‌తో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో ఖేడ్ ఎంతో వెనుకబడి ఉందన్నారు. ప్రచారంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం

నారాయణఖేడ్: ఎన్నికల పేరుతో కల్లు దుకాణాలపై పోలీసు, ఎక్సైజ్ శాఖలు అక్రమ దాడులు చేస్తూ గీత కార్మికులను భయాందోళనలకు గురిచేయొద్దని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లో మాట్లాడారు. గీత కార్మికులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నా పట్టించుకోకుండా కేవలం కల్లు దుకాణాలపై దాడులు చేయడం సరికాదన్నారు. ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

నగదు, మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులు నగదు పట్టుకున్నారు. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల నిబంధనల్లో భాగంగా బీడీఎల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.లక్షను కనుగొన్నారు. ఈ నగదుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అందజేశారు. అదేవిధంగా పటాన్‌చెరు మండలం నందిగామలో మహేష్ కిరణా షాపులో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నానని విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి రూ.8 వేలు విలువచేసే మద్యం సీజ్ చేశారు.

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో పటేల్‌గూడలో కుమ్మరి యాదయ్య ఇంట్లో మద్యం విక్రయిస్తున్నాడని ఆదివారం విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అమీన్‌పూర్ పోలీసులు దాడులు నిర్వహించి రూ.4 వేలు విలువ చేసే మద్యం కొనుగొన్నారు. దానిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

ఉస్మాన్‌నగర్‌లో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లోని లేబర్ క్యాంప్ వద్ద రంగం కిరాణా దుకాణం నడుపుతున్నాడు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దుకాణంలో 14 లీటర్ల మద్యం బాటిళ్ల ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

నాచగిరిలో భక్తుల సందడి

వర్గల్(గజ్వేల్): జిల్లాలో సుప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రం ఆదివారం వారాంతపు సెలవురోజు భక్తులతో కిటకిటలాడింది. శనివారం రాత్రి చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం ఉదయం సంప్రోక్షణ, అభిషేకం అనంతరం ఆలయంలోకి భక్తులకు ప్రవేశం కల్పించారు.


నైరాశ్యంలో కార్యకర్తలు

- పటాన్‌చెరు కాంగ్రెస్‌లో గందరగోళం
- అధిష్టానం నిర్ణయం కోసం ఎదురు చూపులు
- పటాన్‌చెరు అభ్యర్థిత్వంపై వీడని ఉత్కంఠ



పటాన్‌చెరు: పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉన్న కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నీలం మధుకు పటాన్‌చెరు కాంగ్రెస్ టిక్కెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కాటా శ్రీనివాస్ గౌడ్ అనుచరులు తమ భవితవ్యం ఏమిటో అని సందిగ్ధంలో పడ్డారు. ఇదే అదనుగా భావించి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇతర పార్టీల నేతలు తమ పార్టీల్లో చేరేలా వ్యవహరిస్తున్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి, అమీన్‌పూర్‌కు చెందిన పట్లోళ్ల భాస్కర్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. జిన్నారం మండలంలోని కాంగ్రెస్ నేతలు కొందరు కొన్ని రోజుల క్రితం పార్టీ మారారు. అధికార పార్టీ నేత మహిపాల్ రెడ్డి, అతడి అనుచరులు ప్రచారంలో బిజీ అయ్యారు. బీజేపీ అభ్యర్థి నందీశ్వర గౌడ్ కూడా ప్రచార పర్వానికి తెరలేపారు. ఇటీవల గాయకుడు రాహుల్ సిప్లి గంజ్ బీజేపీ అభ్యర్థిపై పాట విడుదల చేశారు. ఆ రెండు పార్టీల శ్రేణులు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండగా, కాంగ్రెస్ శ్రేణులు మాత్రం నిస్తేజంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఢిల్లీలో మకాం వేశారు. తొలి నుంచి కాంగ్రెస్‌లో కాటా శ్రీనివాస్ గౌడ్ కు లేదా గాలి అనిల్ కుమార్‌కు టిక్కెట్ వస్తుందని స్థానికులు భావించారు. కానీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నీలం మధు కూడా టిక్కెట్ రేస్‌లో ఉండటంతో ఆ పార్టీలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా కొందరు పార్టీ వీడాలని యోచిస్తూ ఉండగా మరి కొందరు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెబుతున్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడుతా



మేము పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ తోనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. పార్టీ పెద్దల నిర్ణయం మేరకు మా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తాం.

– రాజు గౌడ్, మాజీ సర్పంచ్ కొల్లూరు

కాటాకే టిక్కెట్ ఇవ్వాలి



కాంగ్రెస్ పార్టీలోనే ఉండి, అధికార పార్టీతో దశాబ్ద కాలంగా పోరాటం చేస్తున్న కాటా శ్రీనివాస్ గౌడ్‌కే టిక్కెట్ ఇవ్వాలి. ఆయనకు టిక్కెట్ ఇవ్వకపోతే తాము పార్టీకి రాజీనామా చేస్తాము. ముకుమ్మడి రాజీనామాలు ఉంటాయి.

– రామ్ గోపాల్, కాంగ్రెస్ నాయకుడు, రుద్రారం

అకౌంట్స్ వివరాలు తెలపాలి

- నామినేషన్‌కు 48 గంటల ముందే బ్యాంక్ ఖాతా
- నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు నలుగురికి అనుమతి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: రానున్న ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి తన ఖాతా వివరాలను ఎప్పటికప్పుడు అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ ఆఫీసర్‌కు అందజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కి 48 గంటల ముందే అభ్యర్థి జాతీయ బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేయాలన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అయ్యే ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల్లో రూ.10 వేలు మాత్రమే నగదు రూపంలో, మిగతా రూ.39 లక్షల 90 వేలు ఆన్‌లైన్‌లో ఖర్చు చేయాలని చెప్పారు. గుర్తింపు పొందిన పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తే ఒకరి ప్రపోజల్ సరిపోతుందని, అదే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తే పదిమంది ప్రపోజల్స్ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్, మాస్టర్ ట్రైనర్ అమరేందర్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని పార్టీని ఓడించాలి

సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద

సదాశివపేట(సంగారెడ్డి): గత ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఓడించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి.వినోద పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, నిధులతోపాటు ఉద్యోగాలు తెలంగాణ ప్రజలకే వస్తాయని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఒక్కటికూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతోందని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. కేసీఆర్ మళ్లీ మోసం చేయడానికి ప్రజల ముందుకు వచ్చాడని, ఈసారి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రమైన పటాన్‌చెరు

- వేలాదిమంది కార్యకర్తలు, కళారూపాలతో భారీ ర్యాలీ
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

పటాన్‌చెరు టౌన్: మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని 29 రాష్ట్రాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొల్కూరి విజయభాస్కర్ రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. మైత్రి గ్రౌండ్ నుంచి జీఎంఆర్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ తీశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొల్కూరి విజయభాస్కర్ రెడ్డి, కృష్ణయాదవ్, సంతోష్ యాదవ్, మహేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, కాజిపల్లి, ముత్తంగి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధించినట్లు అవుతుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రతీ ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీ విజయానికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో వివిధ పార్టీల నుంచి భారీ చేరికలు ఉండబోతున్నాయని ప్రకటించారు. అనంతరం ఉత్తరప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ ఠాకూర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం వచ్చి పటాన్‌చెరు నియోజకవర్గంలో జీవనం సాగిస్తున్నారని, వారందరినీ సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ వారి ఆర్థిక ప్రగతికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సహకారంతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాడని, మూడోసారి ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, వివిధ సంఘాల అధ్యక్షులు ప్రసంగించారు. సమావేశంలో సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్పా నగేష్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు చంద్రరెడ్డి, బాల్‌రెడ్డి, నర్ర భిక్షపతి, వరప్రసాద్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డికి వినాయకుని ప్రతిమ అందజేస్తున్న దృశ్యం



ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

అన్నివర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలోని మలయాళీ కుటుంబాలు ఎమ్మెల్యేకు తమ మద్దతు ప్రకటించాయి. శనివారం రాత్రి పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కేరళ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హాజరై మాట్లాడారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం కేరళ మలయాళీల సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించడంతోపాటు నారాయణ దేవాలయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నగేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు డిపాజిట్లు దక్కవు

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనకబడిందని, తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోయిందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా పార్టీలకు చెందిన వందమంది కార్యకర్తలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు దక్కవన్నారు. మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఎవరికొచ్చినా కలిసి పనిచేయాలి

అందోల్ అసెంబ్లీ కన్వీనర్ ఉదయ్ బాబూమోహన్



బీజేపీ నాయకులతో ఉదయ్ బాబూమోహన్

జోగిపేట (అందోల్): బీజేపీ అధిష్టానం అందోల్ టికెట్ ఎవరికిచ్చినా కలిసి పనిచేసి గెలిపించుకోవాలని అందోల్ అసెంబ్లీ కన్వీనర్ ఉదయ్ బాబూ మోహన్ అన్నారు. ఆదివారం జోగిపేట పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం అందోల్ టికెట్ ఎవరికిచ్చినా నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి అఖండ మెజారిటీతో అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జోగిపేట పట్టణ అధ్యక్షుడు సత్యసాయి, చౌటాకూర్ మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, అందోల్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీలకు న్యాయం

పటాన్‌చెరు: బీజేపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని బీజేపీ పటాచెరు ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పలువురు యువకులు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్, అమీన్‌పూర్ పట్టణ అధ్యక్షుడు ఆగారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అనిల్ చారి తదితరులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డికి ఆ స్థాయి లేదు

టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

సంగారెడ్డి: మంత్రి హరీశ్‌రావును విమర్శించే స్థాయి జగ్గారెడ్డికి లేదని టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆదివారం అన్నారు. జగ్గారెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత సంగారెడ్డికి ఎన్నిసార్లు వచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రిగా ఉన్న హరీశ్‌రావు సంగారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో సంగారెడ్డికి జగ్గారెడ్డి ఒక్క రూపాయి తెచ్చాడా అని ప్రశ్నించారు. దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు.

సంక్షిప్త వార్తలు

◆ విరాళం అందజేత



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో నూతనంగా నిర్మించనున్న శివాలయ నిర్మాణానికి విరాళాలు అందించేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు. వర్తక సంఘం నాయకులు ఆదివారం రూ.20 వేల విరాళం నిర్వాహకులకు అందజేశారు. దేవాలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు.

◆ బీఆర్ఎస్‌కు అపూర్వ స్పందన

కోహీర్(జహీరాబాద్): బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపూర్ గోల్డెన్ దాబాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీకి లభిస్తున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నాయకుల మధ్య సయోధ్య కొరవడి కాంగ్రెస్ పార్టీ నాయకులు పోట్లాడుకొంటున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో మాణిక్‌రావు విజయం సాధిస్తారన్నారు.

◆ విజయభేరి యాత్ర సభకు..



సదాశివపేట(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి యాత్ర సభకు సదాశివపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. సభకు వెళ్లినవారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పట్నం సుభాష్, కౌన్సిలర్లు కోవూరి లక్ష్మీప్రసన్న, నాగరాజ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ రాయపాడ్ రమేష్ తదితరులు ఉన్నారు.

నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో ఆదివారం నగర సంకీర్తనను భక్తులు ఘనంగా నిర్వహించారు. హరేరామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో సుమారు రెండు గంటల పాటు కీర్తనలు ఆలపించారు. భగవద్గీత, రామాయణాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హరే రామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

◆ ఖేడ్ అభివృద్ధికి పోరాటం

నారాయణఖేడ్: నిరుద్యోగులు, యువకులకు ఉపాధి కల్పిస్తూ ఖేడ్‌ను అభివృద్ధి పర్చాలంటూ నారాయణఖేడ్‌కు చెందిన సామాజిక కార్యకర్త షేక్ మహబూబ్ 'అభివృద్ధి, సంక్షేమం కోసం పేదవాటి పోరాటం' పేరిట నాలుగు నెలలుగా శాంతియుత పోరాటం చేస్తున్నారు. నారాయణఖేడ్‌లో సోమవారం ప్రజాఆశీర్వాద సభ జరగనున్న నేపథ్యంలో ఆదివారం ఖేడ్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. సమస్యల ఫొటోలను ఫ్లెక్సీగా చేసి పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. శాంతియుత పోరాటం చేస్తున్న మహబూబ్‌ను పట్టణ వాసులు అభినందిస్తున్నారు.



■ కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు



రాయికోడ్(అందోల్): కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని షంశోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తనయుడు తోపాల రాములుతో పాటు 50 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాలను చూసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బసవ రాజ్‌పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పటేల్, బీఆర్ఎస్ నాయకులు రాజు, నరసింహులు పాల్గొన్నారు.

■ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్‌తోనే జహీరాబాద్ అభివృద్ధి సాధిస్తుందని టీఎస్ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్ పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకపోతోందన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే మండలంలోని రంజోల్ గ్రామానికి చెందిన మైనార్టీ యువకులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

రాయికోడ్(అందోల్): మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున్ పాటిల్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ పటేల్, సర్పంచ్ సలీం, స్థానిక నాయకుడు సల్మాన్ పటేల్ లు ఉన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ సమక్షంలో ఆ పార్టీ నాయకుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ షబ్బీర్ ఖాన్, మహేష్ పాల్గొన్నారు.

■ సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ..

నారాయణఖేడ్: బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు చేరుతున్నారని ఖేడ్ బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి తెలిపారు. సిర్గాపూర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఖేడ్‌లో భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

■ పార్టీ విజయానికి కృషి చేయాలి



రాయికోడ్(అందోల్): త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శంకర్ కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. ఆదివారం రాయికోడ్‌లో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దళిత ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండే క్రాంతికిరణ్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మారుతి, ఎంపీటీసీ నిరంజన్, శంకర్, ప్రవీణ్, రవికుమార్, దళిత నాయకులు పాల్గొన్నారు.

■ తప్పుడు ప్రచారం

కోహీర్(జహీరాబాద్): బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపూర్ గోల్డెన్ దాబాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీకి లభిస్తున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నాయకుల మధ్య సయోధ్య కొరవడి కాంగ్రెస్ పార్టీ నాయకులు పోట్లాడుకొంటున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో మాణిక్‌రావు విజయం సాధిస్తారన్నారు.